# 12. పునశ్చరణ

అలసిసొలసి అర్ధరాత్రికి భద్రయ్య కొంపజేరాడు. భార్య విసుక్కుంటూ లేచి తలుపుతీసింది. ఇంట్లో పిల్లలందరూ చాలీ చాలని దుప్పట్లు కప్పుకొని పడుకున్నారు. ప్రశాంతంగా వున్న యీ వాతావరణాన్ని భంగపరచినందుకు భద్రయ్య నొచ్చుకున్నాడు. కాని ఇంటికి రాకుండా, ఆకలితో నకనకలాడే కడుపులో ఏమీ వేయకుండా వీధిలో తెల్లవార్లూ గడపటం మాటలుకాదు!

చల్లనినీళ్ళతో కాళ్ళూ చేతులూ కడుక్కున్నాడు భద్రయ్య. పిల్లల్లే వంటింట్లోకి దూరాడు. భార్య సుబ్బమ్మ గొణుక్కుంటూనే చల్లగా చల్లారిన మెతుకుల్ని అల్యూమినియం బొచ్చెలో రాల్చింది– కాస్త చింతకాయపచ్చడి వేసింది. 'ఇంతేనా ఇంకా ఏమన్నావుందా?' అన్నట్లు చూశాడు భద్రయ్య. ఆమె జవాబు చెప్పలేదు. ప్రశ్న అర్థమైనా జవాబులు చెపుతూ కూర్చోవటం ఆమెకు ఇష్టంలేదు... భద్రయ్య కష్టపడలేదు. 'ఇంకా ఏమైనా వుంటే వేసేదేగా' అనుకుని సరిపెట్టుకున్నాడు. రుచినెరగని ఆకలిని తృప్తిపరచసాగాడు.

"అడిగావా?" అంది సుబ్బమ్మ.

భద్రయ్య పరధ్యానంగా వున్నాడు.

"ఏమిటీ?" అన్నాడు, దేన్నీ గుర్తుంచుకోగల తీరికా, ఓపికా అతనికి లేవు.

"ఏమిటా?... రాత్రి చెప్పిందంతా మరిచిపొయ్యావా? ఎన్నాళ్ళిట్లా? ఒకపూట తినీ, ఒకపూట తినకా యీ చిరిగినబట్టలు కట్టుకుంటూ... ఛీ...ఛీ... సుఖమంటే యేమిటో తెలియకుండానే... ఇంతకూ నిన్ను పెళ్ళాడినందుకు యీ బాధలు..."

ఆ తరువాత పాటంతా భద్రయ్యకు తెలుసు. ప్రతిరాత్రీ తను ఈ పాటను వింటూనేవున్నాడు. మొదట్లో ఈ పాట అతన్ని కదిలించేది. కాని రోజూ అలవాటవటంమూలాన ఆమె ధోరణి తనది అన్నట్లుగానే ఊరుకున్నాడు.

ఐతే రోజూకన్న కాస్త ఘాటుగానే ఆమె మాట్లాడసాగింది. ఇరవై సంవత్సరాల దాంపత్యజీవితాన్ని గూర్చీ, తను భరిస్తూ, సహిస్తూ వొస్తూన్న బాధల్ని గూర్చీ ఆమె మొదలెట్టింది. తన భర్తకు కూడా స్పష్టంగా తెలిసిన అనేక కష్టాలూ, విధిలేక అనుభవిస్తూన్న బాధల్ని గూర్చీ, తలుచుకుంటేనే బాధను రేకెత్తించే సంఘటనల్ని గూర్చీ ఆమె చర్చించసాగింది. అదంతా నిజంకాదని కాదు. దాన్ని తరచటంవల్ల ఆమె తన మనశ్శాంతినే కాకుండా, తన భర్త మనశ్శాంతిని కూడా పాడుచెయ్యసాగింది. ఈ సంగతి ఆమెకు తెలుసు. తన భర్త మనస్సు పాడుచెయ్యటంవల్ల, కనీసం రోషంతోనన్నా కుటుంబాన్ని సుఖపెట్టగల మార్గాన్వేషణ జరుగుతుందని ఆమె ఆశ.

ఆమె వూహించినట్లు భద్రయ్యలో తగినంత చలనం కలిగింది. రుచీపచీలేని ఆ పచ్చడి మెతుకుల్నే నంజుతూ లోలోన అతను కుమిలిపోసాగాడు. ఐతే తనబాధనుకూడా వెళ్ళగక్కటంవల్ల ఉభయులూ అనుభవించాల్సిన బాధ రెట్టింపు అవుతుంది. అదీగాక పగలంతా కష్టపడి పనిచేసి ఉండటంవల్ల సాధ్యమైనంత త్వరగా శరీరాన్ని పక్కమీదికి చేర్చటం అవసరమనిపించింది. భార్యతో మాట్లాడటం మొదలుపెడితే, తెల్లగా తెల్లారినా ఆ సంభాషణ తెగదు. ఇదంతా ఆలోచించే భద్రయ్య చెప్పుకింది తేలల్లే మెదలకుండా వూరుకున్నాడు. పైకేమీ మాట్లాడకపోయినా భార్య అనే ప్రతిమాటకూ, మనసులో సమాధానం చెప్పుకుంటూనే ఉన్నాడు. ఇందువల్ల వాగే శ్రమ తప్పినప్పటికీ, ఆమె మాటల తాలూకు వేదన వృథాపోకుండా తాను పొందుతూనే ఉన్నాడు.

తన భర్త ఏమీ మాట్లాడకపోవటంతో సుబ్బమ్మ ఊరుకుండి ఉండవలసిందే! కాని ఆమె యీరోజు చాలా పట్టుదలతోవుంది. ఆరు నూరైనాసరే తన భర్తను ఒకదారికి లాక్కురావాలని ఆమె నిశ్చయం. భర్త జవాబులు చెప్పకపోవటాన్ని ఆమె ఒక అసమర్థతగా, జవాబు చెప్పలేక పోవటంగా, అంతకన్న తన ప్రతిమాటనూ అంగీకరిస్తూన్నట్లుగానే తీసుకుంది. ప్రతివాది మెదలకుండా వూరుకోవటం, వాది వాదనకు బలాన్ని చేకూర్చినట్లే, వాది తాను సరైన మార్గానవున్నట్లే నమ్మించి, మరింతగా వాగ్ధోరణిని పెంచినట్లుగానే ఆమె కంఠస్వరాన్ని పెంచి మరింత కఠినంగా మాట్లాడసాగింది.

ఆమె గమనించలేకపోయినప్పటికీ, భద్రయ్య మనసులోని అగ్నిపర్వతం బద్దలవటం, ఆ వేడిలావా ప్రవాహాలతో అతని మనస్సంతా తెకతెకలాడటం జరుగుతూనే వుంది. ఐతే తాను పొందే అనుభూతుల్ని పైకి పొక్కనీకుండా జాగర్తపడసాగాడు. ఎందుకంటే తను బైటపడటంవల్ల ఆమె మరింత రెచ్చిపోతుందని అతని భయం!

మెల్లిగా శరీరాన్ని పక్కమీదికి చేర్చాడేకాని, ఒక పక్కనుంచి సుబ్బమ్మ మాటలు శూలాల్లా గుచ్చుకుంటూనే ఉన్నవి. రెండోవైపు తనమనస్సే శూలమై బాధించసాగింది. శరీరం నిద్రనుకోరుతూన్నప్పటికి మనస్సు నిద్రపోనీకుండా అన్నివైపుల నుంచీ అతన్ని పిండసాగింది.

నిద్ర ఎలాగూరాదు. కనీసం సుబ్బమ్మ ఇకనైనా మాట్లాడకుండా వూరుకుంటే కొంచెం కుదురుగా ఆలోచించుకోవచ్చు. వృథాగా ఉద్రేకపడటంవల్ల ప్రయోజనం ఉండదు. అదీగాక మొదటినుంచీ చాలా శాంతంగానూ, కుదురుగానూ జీవితాన్ని నడిపేందుకు భద్రయ్య అలవడ్డాడు. ఇందువల్ల లాభనష్టాలు ఎలా వున్నప్పటికీ కొంతలో కొంతన్నా తను సుఖపడగలుగుతున్నాడు. అంతేచాలని తృప్తిపడగలుగుతున్నాడుకూడా!

కళ్ళు మూసుకున్నాడన్న మాటేకాని, తన స్థితి అంతా కళ్ళకు కట్టినట్లుగానే ఉంది. సుబ్బమ్మ రన్నింగ్ కామెంటరీ దృశ్యాన్ని మరింత భయంకరంగా తయారు చేస్తోంది. ఇప్పటికైనా సుబ్బమ్మ నోరునెప్పిపెట్టి ఆపివుంటే, భద్రయ్య సమస్యాపరిష్కార మార్గాన్ని ఆలోచించగలిగేవాడు.

సుబ్బమ్మ గతాన్నుంచి, వర్తమానానికి వొచ్చింది. ఇంట్లో లేనివస్తువులూ, దైనందినంగా తానుపడుతూన్న బాధలూ, మరీ తెల్లారాక, పండుగ చేసుకోవాల్సిన అవసరమూ, తనతోపాటు పిల్లలు సహిస్తూన్న వేదనా మొదలైనవి చెప్పుకొని పోసాగింది... ఆమె దాదాపు తన పాఠాన్ని పూర్తిచేసి నప్పటికి భర్త కదలకుండా, మెదలకుండా పడుకొని వుండటంతో అరికాలిమంట నెత్తికెక్కింది. తన భర్త చెవిటివాడు కాదని ఆమెకు తెలుసు. తనకూ, కుటుంబానికి కనీసం సానుభూతి చూపవలసిన తన కనీస బాధ్యతను కూడా మరిచిపోయి చలనరహితంగా ఉండటం పుండుమీద కారం చల్లటంకాక మరేమిటి? తాము అనుభవించే బాధలకు మరోకొత్త బాధను జోడించటమే అతని ఉద్దేశ్యమేమోననే అనుమానంకూడా ఆమెకు కలిగింది. ఒకవేళ నిద్రపొయ్యాడేమోనని ఆమె దగ్గరకు వొచ్చి చూసింది. ప్రస్తుతానికి యీమె తాకిడినుంచి విముక్తి పొందేందుకుగాను భద్రయ్య నిద్రను నటించ సాగాడు. యీ ఎత్తు పారటంవల్ల ఆమె విసుగ్గానిట్టూర్చి, లోలోన తన యీ దురవస్థలకు కారకులైనవారందర్నీ పేరు పేరునా దూషించుకోసాగింది.

గాలివాన వెలిసినట్లుంది. భద్రయ్యకు ఎంతో రిలీఫ్ వొచ్చిపడింది. శరీరం విశ్రాంతి తీసుకుంటూన్నప్పటికి బుర్ర తీవ్రంగా పనిచేయసాగింది.

భార్య అన్నమాటల్లో ఒక్కటీ అబద్ధం లేదు. కుటుంబమంతా బాధతోనే జీవిస్తూ వుంది. ఐతే కుటుంబంలోని మిగతా వ్యక్తులకు కలగని సుఖాల్ని తాను పొందటంలేదు. వారి కష్టాల్నే తానుకూడా పంచుకొని భరిస్తున్నాడు. కాని తన భార్య ఉద్దేశంలో తను తెచ్చిపెట్టే అనేక బాధల్ని తామంతా పంచుకుంటూన్నట్లుగా మాట్లాడింది. ఇది

అన్యాయమే ననిపించింది... అదంతా అలావుంచి తను సుఖపడుతూ మిగతా అందర్నీ సుఖపెట్టగల మార్గమేదన్నా ఉందా? యిందులో స్వార్థంతో పాటు పరమార్థంకూడా వుంది.

ఒకటి మాత్రం నిజం: అవకాశమున్నంతలో తను సుఖపడుతూ, తన కుటుంబీకుల్ని సుఖపెట్టేందుకు శక్తివంచన లేకుండా శ్రమపడుతూనే వున్నాడు. ఉదయం ఏడింటికి షాపుకు వెళ్ళి రాత్రి పొద్దుపొయ్యేదాకా పనిచేసి వొస్తాడు. మానవమాత్రుడు ఇరవైనాలుగు గంటల రోజులో ఎంతపని చేయగలడో, అదంతా తాను చేస్తూనేవున్నాడు. ఐతే తన కష్టానికి తగినట్లుగా ప్రతిఫలం పొందలేకుండా ఉన్నాడు. ఈ ప్రతిఫలం రూపాయి అణాల పైసల్లో చెప్పుకోవాలంటే నెలకు అరవై రూపాయిలు: దీన్నే మరో రూపంలో చెప్పుకోవాలంటే తన కుటుంబీకుల నిత్య జీవితావసరాలలో సగభాగంకూడా తీరేందుకు చాలదు. పగలల్లా పనిలో నిమగ్నుడై ఉండటంవల్ల యీ సంగతులే ఆలోచించేందుకు వీలుండదు. రాత్రి అలసివుండటంవల్ల నిద్రమైకంలో ఆలోచించలేడు. కాని ఇవాళ అట్లాక్కాదు, తీవ్రంగా ఆలోచించి తీరవలసిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

తెల్లారితే పండుగ! పండుగరోజుకూడా తను పనిచేస్తాడు. రోజుకన్న యెక్కువగానే పనిచేయాల్సి ఉంటుంది. ఎందుకంటే పండుగకు అనేకమంది కొత్తబట్టలు కుట్టించుకుంటారు. ఐతే చాలామందికి పండుగేకాని– తనకు వొట్టి దండగ! పండుగరోజుకూడా యితర రోజుల్లాటిదే. కాని ఇతరులు చాలామంది ఈ పండగ రోజు ప్రాముఖ్యతను చాటుతూ రోజుకన్నా ఎక్కువ ఆనందంగా సుఖంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇంతమందికి ఆనందకరమైన రోజు తనకూ, తనలాటి మరికొందరికీ చాలా గడ్డుగా కనిపించి, బాధపెడుతుంది... ఈ బాధపడేవాళ్ళే సుఖపడేవాళ్ళ సౌఖ్యానికి మరో అంతస్తు పైకి జరుపుతూంటారేమో? అదేవిధంగా యీ సుఖపడే వాళ్ళు బాధపడేవాళ్ళ బాధను మరోమెట్టు కిందికి తోస్తూంటారేమో?

ప్రతిపండగ ముందురోజూ యజమాని జీతం కాకుండా వేరే ఒక నెలజీతం బోనస్ ఇస్తూండేవాడు. ఈసారికూడా అలాగే ఇస్తాడనే ఆశతోనే అందరు పనివాళ్ళ ముఖాలూ కళకళలాడినవి... కాని తీరా వొట్టిచేతుల్తో రావాల్సి వొచ్చినప్పుడు అందరి ముఖాల్లోనూ ప్రేతకళలు పొడసూపినవి. యజమానిని అడిగే ధైర్యం యెవ్వరికీ లేదు. పదిహేను సంవత్సరాలనుంచీ పనిచేస్తూన్న తనకే లేదు. ఒకవేళ ధైర్యంచేసి అడుగుతే, పనిలోనుంచి చాలించుకోమంటే యీ ఒంటిపూట కూడుకూడా కరువౌతుందనే భయం పనివాళ్ళందరికీ ఉంది.

ఎంతోమందికి కొత్తబట్టలు కుట్టి యిచ్చే పనివాళ్లెవ్వరూ కట్టుకునేందుకు నోచుకోలేదు. కనీసం పండగపూట కడుపునిండా తిని మనస్సు సంతోషంతో

ఉంచుకునేందుకైనా వీలులేని పరిస్థితుల్లో బతుకుతున్నారు. ఏదో యెలాగో చావకుండా బతకగలుగుతున్నామనే తలంపు మినహాగా మరోటిలేదు... ఈ కూపంలో నుంచి బైటపడే మార్గమేదన్నా వుంటే తప్పకుండా ప్రయత్నం చేయవలసిందే!

యజమానిని బోనస్ అడగమనీ, జీతం పెంచమని వొత్తిడి చెయ్యమనీ గత రాత్రే భార్య నయానా, భయానా కూడా చెప్పింది. భద్రయ్య అప్పటికి మాత్రం అడిగితీరాలనే నిశ్చయించుకున్నాడు. తన నిశ్చయంతో పాటు భార్యకు వాగ్దానం కూడా చేశాడు. అదంతా గుర్తుందికాని, అడిగేందుకు జంకి ఊరుకున్నాడు. ఈ సంగతులన్నీ ఆమెకు అర్థమయేట్లుగా చెప్పగలగటం తన శక్తికి మించినపని. అంత ఓపికా లేదు. తనకూ ఆమెకూగల సంబంధ బాంధవ్యాలలాటివే, తనకూ తన యజమానికీ ఉన్నవని ఆమె భ్రమ!

ఆమెచేత చెప్పించుకోవాల్సిన అవసరంలేదు. తనకు తెలియని సంగతులు ఆమె ఏం చెప్పగలదు కనుక? ఆమె చెప్పినా, చెప్పకున్నా ఐదారునెలలనుంచీ అతని బుర్ర యీ ఊబిలోనుంచి బైటపడే మార్గాన్ని గూర్చి తీవ్రంగా ఆలోచిస్తూనే వుంది. ఆ మార్గం తన భార్యదృష్టివలె అడ్డదారిగానూ, తేలిగ్గానూ భద్రయ్యకు కనిపించక పోవటంవల్లనే అతని ఆలోచనలు ఎంతకూ తెగకుండా ఉన్నవి. ఐతే యీ ఆలోచనలకు దాదాపు చివరిఘట్టం రావలసిన సమయమైంది. కనుక ఎటో అటు తేల్చుకోనిదే తనకు ముక్తిరాదు!

మొదటినుంచీ తక్కువ మాట్లాడేందుకే భద్రయ్య అలవడ్డాడు. ఎవరితప్పునైనాసరే తనే భరించగల సామర్థ్యం ఏళ్ళతరబడిగా అతను సాధించగలిగాడు. ఇందువల్ల అతను చాలా మెత్తనివాడని చాలామంది అభిప్రాయం. మెత్తదనం వల్ల మొత్తబడటాన్ని కూడా అతను భరిస్తూ వొస్తున్నాడు... కాని తన మనస్సు క్రమంగా వేరొకరూపాన్ని పొందుతూనేవుంది. తను తిరగబడ్డనాడు తన నిజస్వరూపాన్ని చూసి అందరూ చకితులవక తప్పదు!

నిజమే- ఎన్నాళ్లీ బాధలు! తన వయస్సా నలభై పైబడింది; మహాబతుకుతే మరోపది, పదిహేనేళ్ళు. ఐతే తను సుఖపడిందేమిటీ? ఏమీలేదు- వయసు పెరుగుతూన్నకొద్దీ, శక్తి తగ్గుతుంది: దాంతోపాటే సంపాదనకూడా తగ్గవచ్చు. యీ వొచ్చేసంపాదనే చాలక ఛస్తూవుంటే, ఇది ఇంకాతగ్గుతే ఇక చెప్పవలసిందేమిటి! కాస్తో కూస్తో సంపాయించగలిగే సమయమంతా దాటిపోయాక తను చేయగలిగేది మాత్ర మేముంటుందీ? ఇప్పటికైనా మేలుకొని కొద్దిగానన్నా వెనకేసుకోకపోతే, తనగతి కుక్కలకూ నక్కలకూ ఎరుక! ప్రస్తుత పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకొని భావిని ఆలోచిస్తుంటే, నిజంగానే పైకిరాలేని దిగుడుబావిలాగే తోచింది!

తనకు పట్టినగతే తనతరువాతి తరంవాళ్ళకు పట్టకుండా చూడవలసిన తన బాధ్యతను భద్రయ్య విస్మరించలేదు. అందుకనే ఇద్దరు కొడుకుల్నీ చదివిస్తున్నాడు. తను పెద్దవాడయ్యాక వాళ్ళు కాస్త ఆధారంగా వుంటారనీ, వాళ్ళు సుఖపడుతూ తననూ, తన భార్యనూ సుఖపెడతారనీ భద్రయ్య నమ్మకం. ఐతే వాళ్ళను చదివించటం, వాళ్ళకు కావలసిన కనీస అవసరాల్ని తీర్చటం చాలా కష్టంగా వుంది. కష్టపడితేనే కాని సుఖపడే అవకాశం వుండదనే నమ్మకంతోనే భద్రయ్య ముందుకు సాగుతున్నాడు. కాని అతను ముందుకు సాగకుండా సంసారబంధాలూ, ఆర్థిక దురవస్థా కాళ్ళకు బంధాలుగావుండి ముందుకు అడుగుపడకుండా అడ్డుతూన్నవి.

తొందరపడి బుర్ర చెడగొట్టుకొని, పెడతోవను పడటం భద్రయ్యకు బొత్తిగా ఇష్టంలేదు. వేరొక ఆధారం వుంటేనే కాని, వున్న ఆధారాన్ని పాడుచేసుకోవటంవల్ల తనూ తనతోపాటు తనకుటుంబమూ యీ ఒంటిపూట భోజనంకూడా లేకుండానే మాడవలసివుంటుంది. అందుకని యీ వున్న పరిస్థితికన్న, మంచిపరిస్థితిని అందుబాటులోకి తెచ్చుకోనిదే, తను మార్పును పొందలేడు.

కనుక ముందు జరగాల్సినదంతా విశదంగా మనఃఫలకంలో చిత్రించుకున్నాడు. కొంత రిస్క్ వున్నప్పటికీ ప్రయత్నలోపం లేకుండా వుంటే ఒకరకంగా వొద్దునపడొచ్చనే నమ్మకం అతనికి కుదిరింది. ముందు కార్యక్రమంలో కూడా ఏమీ డొంకతిరుగుళ్ళు లేవు. మర్నాటిఉదయం తను యజమానికి చెప్పివేస్తాడు పని మానుకుంటున్నానని. ఆ తరువాత యజమాని బతిమాలుతాడు- జీతంకొద్దిగా పెంచుతానని ఆశజూపుతాడు. తను లొంగడు. బైటికి వొచ్చేస్తాడు. ఇక విశాలవిశ్వంలో తనంతట తానుగా ఒకదారి ఏర్పరచుకుంటాడు! స్వంతవ్యాపారం పెడతాడు. ఇందుకు తగినపనితనం, శక్తిసామర్థ్యాలూ తనకు ఉన్నవి. తనంటే చాలామందికి అభిమానంకూడాను. ఆ ఖాతాదార్ల చలవ వల్ల తను వ్యాపారంలో విజయాన్ని సాధించగలుగుతాడు. ప్రతిరోజూ తను చేసే పని వల్ల కనీసం ఆరు రూపాయిలన్నా యజమాని సంపాయించ గలుగుతున్నాడు. వ్యాపారమే తనదైతే అంతా తనకేవుంటుంది... మరి ఈ వ్యాపారానికి అన్నీ ఉన్నవికాని, పెట్టుబడి ఒక్కటే తక్కువ!

పెట్టుబడి తప్ప మిగతా సమస్య అంతా తేలిపోయినట్లే! భద్రయ్య మనస్సుకూడా చాలా తేలికయింది. పెట్టుబడి విషయంలోకూడా అంత బాధలేదు. అంతాపోగా మిగిలిన పాతికసెంట్ల పొలమూ అమ్మివేస్తే సరిపోతుంది. తనకు ఎవ్వరూ ఎదురుచెప్పేవాళ్ళులేరు; అస లీసంగతి ఎవరికీ తెలియకుండానే పూర్తిచేస్తాడు. ఒకవేళ ఆ పొలం అమ్మకుండానే ఎక్కడైనా అప్పుదొరికే మార్గంవుంటే- అదే మంచిదేమో? తను సంపాయించి భూమి కొనలేకపోయినా, ఉన్నభూమి కాస్తా అమ్మేసి, కుటుంబ పెద్దలకు అపచారం చేయటమన్నా తప్పుతుంది... లేక..

ఆ తరువాత ఆలోచనలు సాగకుండానే నిద్రాదేవి వొడిలో వొదిగిపొయ్యాడు భద్రయ్య. ఆ రాత్రంతా పీడకలలు లేకుండానే భద్రయ్య గాఢనిద్రని అనుభవించగలిగాడు.

## 2

మర్నాడు అంతా అనుకున్నట్లే జరిగింది. ఇంత మెత్తని భద్రయ్య యింతగా కరుకుతేలుతాడనీ, పిరికి భద్రయ్య గుండెల్లోకూడా ధైర్యసాహసాలు పెరుగుతూనే ఉన్నవని కానీ అతన్ని యెరిగినవాళ్ళు ఎన్నడూ అనుకోలేదు. ఆ మాటకొస్తే గతరాత్రి తాను ఊహించినవిధంగానే తను ప్రవర్తించగలుగుతానని అతనే అనుకోలేదు.

ఐదురూపాయిలు జీతం పెంచేందుకు యజమాని ఒప్పుకున్నాడు: కాని భద్రయ్య పని మానుకునేందుకే నిశ్చయించుకున్నాడు. యజమాని పదిరూపాయిలు పెంచేందుకు సిద్ధమయ్యాడు. భద్రయ్య తన పట్టుదలను వొదలలేదు. ఎటూ భద్రయ్యను వొదులుకోక తప్పదని యజమాని గ్రహించాక జీతం పెంచటంవిషయం లాభంలేదని తేల్చుకున్నాడు.

"సరే– స్వంతంగానే మిషన్ పెట్టుకుంటావన్నమాట?" అన్నాడు యజమాని.

ఔనన్నట్లు భద్రయ్య తలవూపాడు.

"మరి నీకు మిషన్ ఏదీ?"

"కొనాలి... కొంటాను"

"నాదగ్గర పదిహేనేళ్ళు పనిచేశావు. నీవంటే నాకు అభిమానం వున్నమాట నిజమే! నీవు వెళ్ళిపోతున్నావనే విచారం వున్నప్పటికీ, ఇంతకన్న పై అంతస్థుకు వెళ్తున్నావు కనుక సంతోషంగానే వుంది."

యజమాని ఏదో కొత్తఎత్తు వేస్తున్నాడని భద్రయ్య గ్రహించకపోలేదు. అందుకని వింటూ వూరుకున్నాడు.

"నీ ప్రస్తుత స్థితిలో మిషన్ యేంకొంటావు? బహుశా అదంతా జాగర్తగా ఆలోచించి వుండవు. నీకు యేదోవిధంగా కొంత సహాయం చేయాలనుకుంటున్నాను–"

భద్రయ్యలో కలిగే సంచలనంకోసం యజమాని ఆగాడు. యజమాని చెప్పే సహాయాన్ని అంటిపెట్టుకొనే కొంత కీడు కూడా ఉండొచ్చని భద్రయ్య అనుమానించాడు. పూర్తిగా తెలుసుకోకుండానే తొందరపడటం అనవసరమని "చెప్పండి" అన్నాడు.

"ఏంలేదు... ఇక్కడున్న మిషన్లలో ఒకటి తీసుకో, సగం ధరకు ఇస్తాను–"

పదిహేనేళ్ళు చెమటోడ్చి చాకిరీ చేసినందుకు ఒక మిషన్ తనకు ఉచితంగా ఇస్తే యజమానికి పొయ్యేదేమీ లేదు. కాని తనకుమాత్రం పెన్నిధి దొరికినట్లే! ఆమాత్రం దయాధర్మాలు యజమానికి లేవు. పోనీ తనకే ఉచితంగా యిమ్మని అడిగేపాటి సాహసం

లేకపోయింది. ఒకవేళ అది అధర్మమే అవుతుందేమోననే అనుమానంకూడా భద్రయ్యను పీడించింది.

ఏమైనా కొత్త మిషన్ కొనటంకన్న సెకండ్‌హాండ్‌తో పనిజరుపుకోవటం ఉచితంగానే తోచింది భద్రయ్యకు. పుష్కలంగా డబ్బువుంటే కొత్తమిషన్‌కాని, లేకుంటే ఇలాటిదే కొనాలని కూడా భద్రయ్య అనుకున్నాడు. యజమాని అమ్మజూపటం తనకు కొంత శ్రమనూ, బాధనూ తగ్గించిన మాట నిజమేకాని- ఇది కొనేందుకైనా తనదగ్గర డబ్బేదీ?

"నా దగ్గర డబ్బులేదు" అన్నాడు భద్రయ్య.

"నాకు ఇప్పుడేమీ ఇవ్వొద్దు. నెలకు ఇంతని ఇవ్వు-"

బాగుంది అనుకున్నాడు భద్రయ్య. యజమాని తనకు చూపిన యీమాత్రం కరుణతో తన సమస్య చాలా తేలిగ్గా పటాపంచలయినట్లుంది. ఆ కాస్త పొలాన్నీ అమ్మక్కర్లేదు. డబ్బుకోసం వాళ్ళ కాళ్ళూ, వీళ్ళ కాళ్ళూ పట్టుకోనక్కర్లేదు. పనిచేసుకుంటూ యజమాని అప్పు తీర్చేయవచ్చు. ఈ ఊహల్తో భద్రయ్య మొహం వికసించింది.

"మిషన్ ఖరీదు తేల్చండి" అన్నాడు భద్రయ్య.

"నీవే చెప్పు-"

"నాకేం తెలుసు? న్యాయమైన ధర మీరే నిర్ణయించండి" అన్నాడు భద్రయ్య దీనంగా.

కాస్త ఎక్కువే చెపుదామనుకున్న యజమానికి బాధ్యతంతా తనమీదనే పెట్టటంవల్ల, నోటికొచ్చింది వాగకుండా, మరోసారి ఆలోచించవలసిన అవసరం కనిపించింది.

"కొత్తది మూడొందలుంటుంది. దీనికి సగంధర నూటయాభై... ఏమంటావ్?"

భద్రయ్యకు ఈ ధర న్యాయంగానే తోచింది. ఐనా కాస్త ఆలోచనలో పడ్డాడు.

"సరే- నూటనలభైకే తీసుకో. నెలకో ఇరవై చొప్పున తీర్చేసెయ్" అన్నాడు యజమాని బేరాన్ని తెగెయ్యటంలో తొందరచూపుతూ.

"సరే- అట్లాగే కానివ్వండి... నేను మామూలుగా పనిచేసేమిషనే తీసుకుంటాను" అన్నాడు భద్రయ్య.

"నీ ఇష్టం... అన్నట్లు ఎక్కడ పెడతావ్?"

"ఇంకా నిర్ణయించుకోలేదు. చోటు కుదరగానే వొచ్చి మిషన్ తీసుకువెళ్తాను."

"త్వరగా చోటుచూసుకో-" అని యజమాని తనపనిలో నిమగ్నుడయ్యాడు.

ఆ షాపువంకా, ఏళ్ళతరబడిగా తనకు స్నేహితులుగా వున్న పనివాళ్ళవంకా విచారంగాచూస్తూ బరువైన హృదయంతో భద్రయ్య బైటపడ్డాడు.

అనుకున్నదానికన్న చాలా తేలిగ్గానే ఈ వ్యవహారం ఒక ఒడ్డున పడినందుకు భద్రయ్య సంతోషించకపోలేదు. కాని చోటు... మంచిచోటు దొరకటం తడవుగా తన స్వంత వ్యాపారాన్ని స్థాపించుకోవొచ్చు.

ఊరంతా తనకు తెలిసిందేకావటంవల్ల ప్రతివీధినీ మనసులో చిత్రించుకొని చూసుకోసాగాడు భద్రయ్య. ఐతే బాగున్న వీధిలో తనకు చోటు దొరకటం కష్టం! చోటు దొరికేచోట మంచి వాతావరణంలేదు. సమస్యలోని ఈ భాగం చాలాక్లిష్టం అనిపించింది.

ఆలోచిస్తూనే రోడ్డుమీద నడుస్తున్నాడు. కనిపించిన పరిచయమున్న ప్రతివాళ్ళకూ ముందుగానే నమస్కారబాణం వొదులుతున్నాడు. వ్యాపారం పెట్టకపూర్వమే, సగం యజమాని కళలు వొచ్చిపడినట్లుగా భావించాడు...

నడుస్తూన్న భద్రయ్యకు వెంకటరత్నం కనిపించేప్పటికి, మరి ఆలోచించటం అనవసరమనిపించింది. ఇదివరకొకసారి వెంకటరత్నం తనను స్వంతంగా మిషన్ పెట్టుకోమనీ, తన అరుగుమీదనే పెట్టుకోవటం మంచిదనీ సలహా ఇచ్చాడు. కనుకనే భద్రయ్యకు వెంకటరత్నం ఎంతో ఆశాజనకంగా కనిపించాడు.

వెంకటరత్నం తీరిగ్గా వుండటం వల్ల భద్రయ్య జరిగిందంతా చెప్పి జరగ వలసినదానికి సలహా అడిగాడు.

"దానికేం! మా అరుగుమీద పెట్టుకో" అన్నాడు వెంకటరత్నం.

"నాకు వూరికెనే అక్కర్లేదు. ఏదో నేనూ కొంత అద్దె ఇచ్చుకుంటాను" అన్నాడు భద్రయ్య.

"అద్దె తరవాత చూసుకుందాంలే."

తనకు గ్రహాలన్నీ ఎంతో సానుకూలంగా వుండటంవల్ల భద్రయ్య చాలా ఆనందంతో వున్నాడు. ఐతే ఇంట్లో యీ సంగతులన్నీ ఇప్పుడే చెప్పకూడదనుకున్నాడు. దీనిమీద భార్య చర్చ సాగించిందంటే తను కంటూన్న కలలు పాడవుతయ్యేమోనని భద్రయ్య అనుమానం.

భర్త మొహం విప్పారి ఉండటంవల్ల ఏదో అదృష్టదేవత పలకరించి వుంటుందని భార్య పసికట్టింది. ఆ సంగతేదో భర్తే చెపుతాడులెమ్మని ఆమె పస్తాయించింది... భద్రయ్య భోజనంచేసి చాలా రోజులుగా అలసిన శరీరానికి విశ్రాంతి ఇచ్చేందుకుగాను గాఢనిద్రకు ఉపక్రమించాడు... అతను సంవత్సరాల తరబడిగా అనుభవించి ఉండవలసిన ఆనందాన్నంతట్నీ ఒక్కసారిగా నిద్రలో పొందినట్లే ఐంది.

ఆ సాయింత్రం వెంకటరత్నం అరుగుమీద షాపు పెట్టేందుకు కావలసిన సామగ్రిని గూర్చి ఆలోచించాడు. పరిసరాలు మంచివే. వీధిలో దాదాపు అందరూ మధ్యతరగతి

కుటుంబీకులు, మర్యాదస్తులూను. అరుగుకూడా పెద్దదే. దాన్ని అరుగు అనటంకన్న వరండా అనొచ్చు. ఇంట్లో కరెంట్ వుండటంవల్ల, ఒక లైటు లాక్కోవచ్చు. మరీ బహిరంగంగా వుండకుండా వుండేందుకూ, వుదయమూ సాయింత్రమూ ఎండ మీదపడకుండా వుండేందుకూ, ఒకవేళ వానవొస్తే తడవకుండా ఉండేందుకూ రెండు తడికలు అవసరమనిపించింది.

యీ విషయాలన్నీ వెంకటరత్నంతో మాట్లాడాడు. ఆయన కూడా తను చెయ్యబొయ్యే వ్యాపారంపట్ల చాలా శ్రద్ధచూపటమే కాకుండా తనకు చేదోడు వాదోడుగా ఉండసాగాడు. చాలా జీవితానుభవంవున్న వెంకటరత్నం సలహాలు తనకు చాలా సహాయంగా వుండగలవని భద్రయ్య నమ్మకం.

వెంకటరత్నంతో స్నేహం ఏనాటికీ చెడకూడదనీ, మొదటినుంచీ ఒకళ్ళనొకళ్లు అర్థం చేసుకుంటూపోతే ముందు ముందు ఎలాటి ఇబ్బందులూ ఉండవనే దృష్టితో భద్రయ్య వరండాకు అద్దెకూడా నిర్ణయించమని పట్టుబట్టాడు. వెంకటరత్నాన్ని ఈ ప్రశ్న చాలా ఇబ్బంది పెట్టింది. చివరకు "నీ యిష్టం" అన్నాడు.

"నెలకు ఐదు రూపాయి లివ్వగలను" అన్నాడు భద్రయ్య.

తన వెధవవరండాకు ఐదురూపాయిల అద్దె వొస్తుందని వెంకటరత్నం కలలోకూడా అనుకోలేదు. మొత్తం ఇంటికి పదిహేను రూపాయిల అద్దెఐతే, అందులో మూడోవొంతు కుక్కలు మాత్రమే ఇన్నాళ్ళూ దొళ్ళుతూవుండే వరండా మీదనే వొస్తుంది? ఈ అద్దెభారం తనకు చాలావరకు తగ్గిందనిపించింది.

"ఒకలైటు కూడా ఇచ్చారంటే మరో రెండు రూపాయిలిస్తాను" అన్నాడు భద్రయ్య.

ఇది చాలా సబబుగానే తోచింది వెంకటరత్నానికి.

"రాత్రిళ్ళు మాత్రం మిషన్ ఇంట్లో పెడతాను–" అన్నాడు భద్రయ్య.

"దానికేం–" అన్నాడు వెంకటరత్నం.

"మరయితే మిగతా పనులుకూడా పూర్తిచేసుకొని ఎల్లుండికల్లా ఇక్కడ పని ప్రారంభిస్తాను" అని వెంకటరత్నం శుభాకాంక్షలతో, కొత్తశక్తిని పొందిన భద్రయ్య చకచకా సాగిపొయ్యాడు.

## 3

వ్యాపారం ప్రారంభించిన వేళా విశేషం ఐతేనేం, భద్రయ్య మంచితనం ఐతేనేం, అతన్ని ఎరిగినవాళ్ళ సానుభూతీ సహాయాలవల్ల నైతేనేం– త్వరలోనే అతని వ్యాపారం మూడుపువ్వులూ ఆరుకాయలైంది.

చేతినిండా పని ఉండటంవల్ల, భద్రయ్య నెలకు పదిరూపాయిల జీతం మీద ఒక కుర్రాణ్ణికూడా పెట్టుకున్నాడు. నెల తిరక్కముందే ఒక బీరువా, ఒక ఇస్త్రీపెట్టె కొన్నాడు. మొదటి నెలలో ఖర్చులన్నీ పోను వందకుపైగానే మిగిలింది.

భద్రయ్య సంపాదనకు అతని భార్య ఉప్పొంగిపోయింది. పూర్వంవలె తన భర్త అసమర్థుడనే అభిప్రాయం ఆమెకు మరిలేదు. అతనంటే ఎంతో అభిమానం కలిగిందామెకు.

"యీ సంగతి నేనెప్పుడో చెప్పాను. ఐదారేళ్ళ కిందనే స్వంతంగా పెట్టినట్లయితే ఎంతో బాగుండేది" అనేది.

భద్రయ్య దీనికి జవాబు చెప్పేవాడు కాదు. ఒకవేళ ఈ వ్యాపారం సాగకుంటే తను చేసినపని చాలా బుద్ధితక్కువదనే ఆమె అనేది. ఆమేకాదు తనను ఎరిగినవాళ్ళందరూ ఆమాటే అనేవాళ్లు. ఈనాడు వ్యాపారం ఎక్కివొచ్చింది కనుక అందరూ తనను గొప్ప ప్రయోజకుడల్లే మాట్లాడుతున్నారు. యీ సత్యాన్ని గ్రహించిన భద్రయ్య భార్యకేకాదు మరెవ్వరికీ కూడా విడమరిచి చెప్పేందుకు ఎన్నడూ ప్రయత్నించేవాడు గాదు.

పూర్వంకన్న కూడా భద్రయ్య చాలా కష్టపడి పనిచేస్తూండేవాడు. ఇప్పుడు తను ఎంత కష్టించినా ఆ ఫలమంతా తనకే దక్కుతుంది. తన కుటుంబంలోని ప్రతివ్యక్తి తన కష్టంతాలూకు ఫలాన్ని పంచుకుంటారు. వారు సుఖపడితే తనూ సుఖపడ్డట్లే!

రాత్రి చాలా పొద్దుపొయ్యేవరకూ మిషన్ దిగేవాడు కాదు. ఒక్కో రోజు ఆ వరండాలోనే పడుకునేవాడు. ఎప్పుడన్నా కాస్సేపు వెంకటరత్నంతో మాట్లాడేవాడు.

"ఎందుకూ అంతశ్రమ పడటం? ఇలా పనిచేస్తే ఆరోగ్యం చెడుతుంది!" అనేవాడు వెంకటరత్నం.

"శరీరంలో శక్తి వున్నప్పుడే కాస్త కష్టపడి చెయ్యగలం. ఆ తరువాత కష్టించవలసిన అవసరంవున్నా, శక్తిలేకుంటే ఏం చెయ్యగలం?" అనేవాడు భద్రయ్య.

రోజులు గడుస్తూన్నకొద్దీ భద్రయ్యకు సంపాదన పెరగసాగింది. సంపాదన పెరగటంలో ఇంకోరైతే గర్వపడేవాళ్ళేమోకాని, భద్రయ్యమాత్రం ఇంకా కరుకుదేరి రాత్రనక పగలనక కష్టపడి పనిచేసేవాడు. పని చేస్తూన్నంతసేపూ అతనికుటుంబంలోని వారందరి ఆనందమూ తన బాధ్యతేననే వూహకు గురవుతూండేవాడు. తన సుఖంకోసం చూస్తే, కుటుంబీకులు బాధపడతారేమోనని అతని భయం!

నలుగుర్లోనూ మంచివాడనీ, పెద్దమనిషనీ అనిపించుకున్నాడు భద్రయ్య. వీధిలోని పిల్లలందరికీ గుడ్డపీలికలు ఇవ్వటంవల్ల, అటు పెద్దల్లోనేగాక, పిన్నల్లోకూడా భద్రయ్య పేరు సంపాదించాడు. ఏడునెలలయ్యేప్పటికి, పూర్వపు యజమాని బాకీఅంతా తీర్చేసి

మిషన్ స్వంతం చేసుకున్నాక, తలమీద పెద్దబరువు వొదిలించుకున్నట్లయింది భద్రయ్యకు.

ఇద్దరు కొడుకులూ చదువుకుంటున్నారు: పెద్దవాడు ఫోర్తుఫారం, చిన్నవాడు ఫస్టుఫారం చదువుతున్నారు. మూడోవాడు నాలుగేళ్ళవాడు. తనలాగు బాధల్తోనిండిన జీవితం కాకుండా కాస్త హాయిగా వాళ్ళు బతకాలని భద్రయ్య ఆశయం. పెళ్ళీడువొచ్చిన ఇద్దరు ఆడపిల్లలున్నారు; కాస్త వెనకేసుకున్నాక, ఆ పిల్లల పెళ్ళిళ్ళు చేద్దామనుకున్నాడు భద్రయ్య.

మిషన్‌పనికి బాగా అలవాటుపడ్డ శరీరం దాని పనిని సరిగా నిర్వహిస్తూండగా, కుటుంబంలోని ప్రతి వ్యక్తిపట్లా తను చేయవలసిన విధులూ, వారి భావిజీవితాలకు తనుపడే జాగ్రత్తల్నీ గూర్చే భద్రయ్య ఆలోచిస్తూండేవాడు. అతని ఆలోచనలన్నీ భావిజీవిత సౌఖ్యానికి సంబంధించినవిగానే ఉంటవి. అవి కలలు కాదనీ, అసంభవమైనవి కావనీ, తనింకా ఇలాగే కష్టించి పనిచేస్తే ఫలించగలవనే నమ్మకం భద్రయ్యలో లోతుగా పాతుకుంది.

భద్రయ్య ఇంటిగొడవలు ఎక్కువగా పట్టించుకోవటం లేదు. అంత తీరుబడిలేదు. ఉదయం ఆరింటికల్లా చద్దన్నం తిని పనికి వొస్తాడు. మధ్యాహ్నం ఒంటిగంటకు వెళ్తే ఇంటికి వెళ్తాడు, లేదా కుర్రాడు భోజనంచేసి వొస్తూవొస్తూ తనకుభోజనం తెస్తాడు. మళ్ళీ రాత్రి చాలా పొద్దుపొయ్యాక కాని ఇంటికి వెళ్ళడు; పని మరీ యెక్కువగా వుండి, ఉత్సాహంతగ్గకుండా శరీరం కాస్త చెప్పుచేతల్లో వుంటే రాత్రంతా మేలుకోవటమో, లేక ఏ తెల్లవారుజామునో కాస్త కునుకు అక్కడే తియ్యటమో చేస్తాడు. ఈ దైనందిన కార్యక్రమంలో ఇతర గోలలు అతనికి పట్టటంలేదు. ఎనభైరూపాయిల దాకా భార్యచేతికి ఇస్తే అన్ని గోలలూ ఆమె పడుతూంటుంది!

ఒక సంవత్సరం గడిచేప్పటి కల్లా భద్రయ్య వెయ్యి రూపాయిలు ఆదా చేయగలిగాడు. ఈ పైకం సంపాయించేందుకు నాలుగేళ్ళల్లో పడవలసిన శరీరకష్టాన్ని అతను అనుభవించాడు. కాలచక్రంలో ఒక సంవత్సరమే గడచినప్పటికీ, అతని ఆయువులో నాలుగింతలు గడిచిందనేందుకు అతని ఆరోగ్యమే ప్రబల నిదర్శనం!

ఆ డబ్బంతా పోస్టాఫీసు సేవింగ్స్ బ్యాంకులో వేసుకున్నాడు. ఈ సంగతి ఎవ్వరికీ తెలియదు. ఆ మాట గుర్తొచ్చినప్పుడల్లా తన ఘర్మబిందువులే ఘనీభవించినయ్యనిపించేది. అత్యంతమైన తృప్తితో, తన జన్మే తరించినంత గర్వంకూడా కలుగుతుండేది! ఎప్పుడన్నా కాస్త బద్ధకంగా వుంటే– తను నిర్వహించవలసిన విధులకు పెద్దలోపం వాటిల్లినట్లూ, తన కుటుంబీకుల హక్కులను అపహరిస్తున్నట్లూ భావించేవాడు భద్రయ్య.

## 4

భద్రయ్యకు జ్వరంవొచ్చింది. రెండుమూడు రోజులు గడిచేప్పటికల్లా కాస్త తీవ్రరూపం దాల్చింది. అక్కడికీ డాక్టర్ని మార్చారు. కొత్తడాక్టరు ఫీజుయెక్కువ పుచ్చుకుంటున్నాడు. ఇటూ, అటూచేసి టైఫాయిడ్‌కిందికి తేల్చారు.

మనిషి రోజురోజుకూ నీరసించిపోసాగాడు. ఇతర దుర్గుణాలేమీ లేకుండటమే ఒక సద్గుణం అనుకోవాల్సి వొచ్చింది. జ్వరంబాధ ఒక పక్కా, తను పనిచేయలేకపోతున్నందుకు తగ్గిన సంపాదనకు తోడుగా మందులకూ మాకులకూ, డాక్టర్‌కూ, కుటుంబ ఖర్చులకూ హరించుకుపొయ్యే డబ్బును గూర్చి భద్రయ్య విచారపడుతూండేవాడు. యీ దెబ్బ కోలుకొనేప్పటికి, మరి మూడునెలలు పనిచేస్తేనేకాని ఈ బొర్ర పూడదు.

మనిషిని వేధించే శారీరక బాధలకు మానసిక బాధలు కూడా తోడైతే ఇక చెప్పవలసిందేమిటి? అందులోనూ ముసలివాళ్ళ లిస్టులో ప్రవేశించబోతున్న భద్రయ్యకు ఇది పెద్ద దెబ్బగానే పరిణమించింది. నిద్రపట్టేందుకు ఇంజక్షన్ ఇచ్చినప్పటికీ అతనికి నిద్రరాకుండా వుంది. శరీరం ఎంత అలసిపోయినా, బుర్ర పనిచేస్తూనే ఉండటంవల్ల శరీరానికి విశ్రాంతి అనేది లేకుండాపోయింది.

క్రమంగా సంధికూడా ప్రారంభమైంది. ఏవేవో పిచ్చిమాటలు- ఒకదానికొకటి సంబంధం లేకుండా వాగేవాడు. తను అసందర్భంగా, అనవసరంగా వాగుతూన్నట్లు భద్రయ్యకు తెలుసుకాని, ఆ వాక్ ప్రవాహాన్ని కట్టెయ్యటం అతనికి చేతనయ్యేదికాదు... ఉండుండి మగతగా, తనేదో పెద్ద గోతిలో పడిపోతున్నట్లనిపించేది; అలా పడకుండా వుండేందుకు సాయశక్తులా పెనుగులాడేవాడు. పెనుగులాడటంకన్న లొంగిపోవటమే తేలిగ్గానూ, తాను చేయగలిగిందిగానూ తోచేది; అదే నిద్రగా పరిణమించేది...

ఏ అర్ధరాత్రికో మెలకువ వొచ్చేది. తన మంచం చుట్టూ కుటుంబీకులంతా తలో పక్కా పడుకొని ఉండేవాళ్ళు; మొత్తంమీద తనను కనిపెట్టుకునే ఉన్నారనీ, తన స్థితికి సానుభూతి చూపుతున్నారనే ఆనందం అతనికి కలిగేది... కాని తను మళ్ళీ ప్రపంచంలోకి రాగలగటమంటూ ఉంటుందా అనే సందేహం కలిగేది... ఇన్నాళ్ళూ లేని యీ అనుమానం కొత్తబాధల్ని తెచ్చిపెట్టింది.

ఒకవేళ ఇది తనకు అంత్యదశే కనుక ఐతే తన తదనంతరం కుటుంబం ఏం కాను? తన పిల్లలా ఇంకా రెక్కలురాని పక్షులు! తను నిలవచేసినదాంట్లో అప్పుడే రెండొందలు ఐపోయింది. ఛస్తాననే భయంకన్న, తను చచ్చాక కుటుంబమంతా భరించలేని బాధలకు గురవుతుందేమోననే భయం అతన్ని ఆవరించింది. ఎంతదూరం ఆలోచించినా తన తదనంతరం కుటుంబానికి అన్యాయం చేసినవాడుగానే

తోస్తోందికాని, న్యాయం జరిపినట్లు నమ్మలేని స్థితిలో పడ్డాడు. ఇక ఆలోచించే ఓపికా, శక్తీలేక, చచ్చేవాడికీ బతికినవాళ్ళకూ ఎలాటి సంబంధమూ ఉండదు కనుక, తన మరణం తనకొక రకం స్వేచ్ఛను తెచ్చిపెడుతుందని, తనందుకు విచారించటం అనవసరమనీ తేల్చుకున్నాడు. తను చావటమే తథ్యమైతే ఇక కుటుంబ విషయాలు పట్టించుకోనక్కర్లేదు; అదీ ఒక అపచారమే అవుతుంది!

–ఒకవేళ తను కోలుకుంటే?

శక్తివంచన లేకుండా మళ్ళీ పనిచేస్తాడు. ఈసారి మృత్యుదేవత పిలుపు వొచ్చేలోపలే కుటుంబం హాయిగా, తనులేని లోటులేకుండా బతికేందుకు తగిన సన్నాహాలు చేసి తన కర్తవ్యాన్ని తనకూ, ఇతరులకూ కూడా తృప్తికరంగా నెరవేరుస్తాడు. ఈ ఒక్కసారికీ మృత్యుదేవత కరుణించాలి కదా ముందు!

వెంకటరత్నం చూసేందుకు వొచ్చాడు. భద్రయ్య ఏమేమో మాట్లాడాడు; తను మాట్లాడింది తనకే అర్థం కాలేదు. వెంకటరత్నం మాత్రం అంతా అర్థమైనట్లే తలవూపాడు. తనను మోసగించేందుకు ప్రతివాళ్ళూ ప్రయత్నిస్తున్నా రనిపించింది– భద్రయ్యకు. ఏమైనా తన స్థితి అటో, ఇటో తేలేవరకూ యీ విషయాల్ని తరచటం చాలా అనవసరమనిపించింది.

## 5

సుబ్బమ్మ మంగళసూత్రం గట్టిది. కిందపెట్టిన భద్రయ్య మెల్లిగా కోలుకున్నాడు. ఐతే మామూలు మనిషయేందుకు రెండునెలలు పట్టింది. ఈ జబ్బువల్లా ఈ రెండునెలలూ పనిలోకి పోలేకపోయినందువల్లా ఐదువందల దాకా ఖర్చయినవి. ఏదో వున్నదికనుక సరిపోయిందికాని, లేకుంటే తనేమయ్యేవాడో, తన కుటుంబం ఏమయ్యేదో ఊహకే ఘోరంగా కనిపించింది!

మూడు నెలల తరువాత భద్రయ్య మళ్ళీ మిషన్ ఎక్కాడు. ఇదివరలో తను పెట్టుకున్న కుర్రాడు ఇంకోచోట పనికి కుదిరాడు. అందుకు భద్రయ్య విచారించలేదు. ఈసారి తోడుగా పెద్దకొడుకును చదువుమాన్పించి తీసుకొచ్చాడు. భార్య దీనికి యేమీ అనలేదు. అసలు యీ విషయంమీద చర్చకూడా జరగలేదు. భర్త ప్రయోజకుడనీ, తన అదృష్టం బాగున్నదనీ సుబ్బమ్మ నమ్మకం. అందువల్ల భర్త చేసే ప్రతిపనీ ప్రయోజనంతో కూడివున్నదనే ఆమె అభిప్రాయం.

వెంకటరత్నం మాత్రం భద్రయ్య మనస్సు మార్చాలని ప్రయత్నించాడు. చదువు మాన్పించటం చాలా పొరపాటని నచ్చచెప్పాలని చూశాడు.

"ఎందుకొచ్చిన చదువులండీ! నేనూ మీలాగే మొదట్లో పొరపాటుపడ్డాను. కాని వీళ్ళ చదువులై సంపాయించేప్పటికి పుణ్యకాలమంతా పోనేపోతుంది. మొన్న టైఫాయిడ్

జ్వరంలో నేను హరీ అన్నట్లయితే ఏమయ్యేదో ఆలోచించండి. ఏడాదినుంచీ వీడికి కాస్త పని నేర్పివుంటే, కుటుంబానికి ఉపయోగపడేవాడుకదా! ఇప్పటికైనా మించిపోయింది లేదు కనుక, వీడికి పని నేర్పానంటే, నా బాధ్యత తీరుతుంది-" ఈ జవాబు విన్నాక వెంకటరత్నం మరి మాట్లాడలేకపొయ్యాడు; భద్రయ్య కుటుంబ పరిస్థితులు తెలుసు కనుక, వెంకటరత్నానికి భద్రయ్యచేసే పని సమంజసమే ననిపించింది.

"అంతగా చదివి ఉద్యోగాలు చేయాలంటే రెండోవాడు ఉన్నాడు" అన్నాడు భద్రయ్య. వెంకటరత్నం భద్రయ్యను ఇందుకన్నా మెచ్చుకోక తప్పలేదు.

"జీవితం భీమాచెయ్యాలనుకుంటున్నాను" అన్నాడు భద్రయ్య. ఇదీ మంచిదే ననిపించింది వెంకటరత్నానికి. నానా అవస్థలూపడి భద్రయ్య రెండువేలకు జీవితాన్ని భీమా చేసుకోగలిగాడు.

భద్రయ్య పెద్దకొడుకు చలపతి చాలా సౌమ్యుడు. తండ్రి మాట వినటంతప్ప వాడికి మరోటి తెలియదు. చదువు మాని మిషన్‌పని నేర్చుకోవటం వాడికి బొత్తిగా ఇష్టం లేనప్పటికీ, ఎదురు చెప్పలేక పనిలోకి వొచ్చాడు. ఒకరకంగా కుర్రాణ్ణి పెట్టుకునే అవసరం లేకుండటంవల్ల కుర్రాడికి ఇచ్చేది వీడే సంపాయించగలుగుతున్నాడనే తృప్తి భద్రయ్యకు ఉండేది.

కాని చలపతి అయిష్టంతోనే పనిచేస్తూండేవాడు. మరీ ఉదయం పదింటికి తనయీడు పిల్లలు బడికి వెళ్తూంటే వాళ్ళందరికీ ఉన్నదేదో తనకు లేదనే బాధ వాణ్ని పీడించేది. సాయంత్రం వీధిలో పిల్లలు ఆడుకుంటూంటే వాడి చిన్ని హృదయం తహతహలాడేది. ఎంతో విచారంగా తనలో తాను కుంగిపొయ్యేవాడు. ఎంత ప్రయత్నించినా వాడికి పని మీద మనసు లగ్నమయ్యేది కాదు. తండ్రి కోప్పడు తూండేవాడు: తండ్రి మనసు కష్టపెట్టకుండా ఉండాలనే నిర్ణయం వాణ్ని వేధిస్తూండేది. రెండు విరుద్ధభావాల సంఘర్షణలో వాడు నలిగిపోతూండేవాడు.

పోనీ ఇంటిదగ్గర ఏదన్నా చదువుకొని తన చదువుసంధ్యల్ని కొద్దిగానన్నా అభివృద్ధిచేసుకుందామంటే, అదీ వీలుండేది కాదు. రాత్రి తొమ్మిదీ, పదైతేనేకాని భద్రయ్య దుకాణం ముయ్యడు. ఆ తరువాత ఇంటికి వొచ్చినా, అలసి వుండటంవల్ల చలపతి భోజనం చెయ్యగానే నిద్రపొయ్యేవాడు. తమ్ముడు బడికి వెళ్తూండేవాడు. వాడికి వున్నదేదో తనకు లేకపోయిందే అనే విచారం చలపతికి వున్నప్పటికీ అది ద్వేషంగా పరిణమించలేదు. పోనీ వాడన్నా బడికి వెళ్ళగలుగుతున్నాడనే తృప్తి కలుగుతూండేది.

చలపతి మనసు లగ్నంకావటంలేదనేది భద్రయ్యకు స్పష్టంగా తెలిసింది. యేదో చిన్నతనమనీ, క్రమంగా అలవడతాడులెమ్మనీ భద్రయ్య సరిపెట్టుకునేవాడు. కాని

రోజులు గడుస్తూన్నకొద్దీ కుర్రాడిలో పెరగవలసిన చలాకీతనం కనిపించటంలేదు. ఏదో శరీరం అలవాటవుతోంది. అలాగే పరధ్యానంతో పనిచేసుకుంటూ వుండేవాడు.

ఇంట్లో చిన్నపిల్లాడికి జ్వరం; వాడికి మందూ అదీ తెచ్చి చలపతి ఆలస్యంగా దుకాణానికి వొస్తూండేవాడు. వీడు కాస్త కుటుంబ విషయాలు పట్టించుకుంటున్నాడనీ, క్రమంగా బాధ్యతలన్నిటినీ గ్రహించగలుగుతున్నాడనీ, ఇలాగే మరి కొన్నాళ్ళు సాగితే, వాడే గాడినపడతాడనే అభిప్రాయం కలిగినప్పుడల్లా, త్వరలోనే తనకు కొంత రిలీఫ్ రాబోతుందనే వూహతాలూకు ఆనందం కలుగుతూండేది.

చిన్నపిల్లవాడి జ్వరం తీవ్రమైంది. ఐనప్పటికీ భద్రయ్య చలించలేదు. ఇంటిసంగతులు పట్టించుకోవాలంటే వ్యాపారం దెబ్బతింటుందని అతని భయం; అక్కడికీ ఇంటివిషయాలు చలపతి చూస్తున్నాడులెమ్మని సరిపెట్టుకున్నాడు. పిల్లవాడి స్థితి బొత్తిగా బాగాలేదు. ఉదయంనుంచీ నాలుగైదుసార్లన్నా చలపతివొచ్చి యింటికి రమ్మని బతిమాలాడు 'ఇదిగో వొస్తున్నా' అనటమేకాని, భద్రయ్య కదలలేదు. తను వెళ్ళి చేసేది ఏముంటుందిలెమ్మనే ధోరణిలో వున్నాడు.

చివరకు సాయింత్రం కుర్రాణ్ణి కిందపెట్టారనే కబురు విన్నాక భద్రయ్య కొట్టుమూసేసి బయలుదేరాడు. అతనిలో కలిగిన ఆతృత బహుకొద్ది; ముంచుకొస్తున్న దన్నప్పటికీ చలించని మనోనిబ్బరం అలవడింది: తగినంత జీవితానుభవం వున్నాక, మన చేతుల్లో లేనిదానికోసం తహతహలాడటం వృధా అనే సూక్ష్మం తెలుసుకోకుండా ఉండటం కష్టమేనేమో?

రాత్రి పదింటికి కుర్రాడు పొయ్యాడు. ఇంట్లో యెవరికీ భోజనాలు లేవు. తల్లి ఏడ్చి ఏడ్చి, మరి ఏడవలేక లోలోనే బాధపడసాగింది. చలపతికి నిద్రపట్టిందేకాని, నిద్రలోనే వాడు ఏడుస్తున్నాడనేది స్పష్టంగా తెలుస్తోంది; రెండోవాడికి ఇదంతా అర్థంకానందువల్ల సుఖంగానే నిద్రపోతున్నాడు. ఇల్లంతా దాదాపు నిశ్శబ్దంగానే వుంది. శవానికి కాపలాగా భద్రయ్య ఒక్కడే మేలుకొన్నాడు.

తన చేతుల్లో వున్నంతా తాను చేస్తూనేవున్నాడు. తన లోపంవల్ల ఏమీ జరగలేదనే తృప్తి ఒక్కటే అతనికి చాలనిపించింది. ఈ మమకారాల మిథ్య నసాళానికి అంటేట్లుగా అర్థమైంది. తనకు కలిగిన విచారానికి తనే సానుభూతి చూపుకుంటూ, ఊరడించుకోసాగాడు. చచ్చినవాళ్ళ మాట అటుంచి, యీ బతికివున్నవాళ్ళకు తనింకా ఎలా ఉపయోగపడగలడా అనేదే ఆలోచిస్తూ తెల్లారేదాకా గడిపాడు భద్రయ్య.

ఉదయం శ్మశానంనుంచి తిరిగివొచ్చి భద్రయ్య భోజనం చేశాడు. ఇల్లంతా బావురుమంటూ విచారంతో వుంది. శరీరం ఎంత అలసివున్నప్పటికీ, ఇంట్లో ఉండబుద్ధి వెయ్యలేదు. మధ్యాహ్నం రెండింటిదాకా వుండి, చలపతిని కూడా తీసుకొని దుకాణానికి వెళ్ళాడు.

వెంకటరత్నం భద్రయ్యని పలుకరిద్దామని బయలుదేరబోతూండగా భద్రయ్యే వొచ్చాడు. భద్రయ్యముఖంలో విషాదంవున్నప్పటికీ, దాన్ని దాచెయ్యాలనీ, ఆ విచారాన్ని ఇతరులు గమనించకుండా ఉండాలనీ విశ్వప్రయత్నం చేస్తూనే వున్నాడు.

"ఏం భద్రయ్యా?" అన్నాడు వెంకటరత్నం. "పాపం- కుర్రాడు పొయ్యాట్ట?"

"ఔనండి... ఏముందిలెండి" అని చప్పరించాడు భద్రయ్య. భద్రయ్య ఇంత జ్ఞానీ వేదాంతీ అవుతాడని, అవగలుగుతాడని వెంకటరత్నం ఎన్నడూ అనుకోలేదు.

"పోనీ ఇవాల్టికి ఇంట్లోనే ఉండలేకపొయ్యావా?" అన్నాడు వెంకటరత్నం.

"ఇంట్లో అసలు తోచదు... ఈ పోయినవాళ్ళ కోసం ఏడుస్తూ కూర్చునేటంత తీరికేది బాబూ?" అన్నాడు భద్రయ్య. భద్రయ్య మనస్సు ఇంత రాటుతేలినందుకు వెంకటరత్నం ఆశ్చర్యపొయ్యాడు. ఈ రకంగా మాట్లాడేవాడికి తన విచారాన్ని తెలియపరిచే విధానం తెలియక వెంకటరత్నం చల్లగా జారుకున్నాడు.

ఆ రోజంతా చలపతి ఏడుస్తూనే వున్నాడు. అలా ఏడవటం అనవసరమనీ, ఏడవకూడదనీ భద్రయ్య కోప్పడుతూనే వున్నాడు. కాని వాడి పసిహృదయం, తమ్ముడు పోయినందుకు గిలగిలా కొట్టుకుంటూనే వుంది. కుటుంబీకుల్లో అందరిపట్లా వాడికెంతో అనురాగం. పోయిన కుర్రాడంటే మరీ ఇష్టం! వాడు ఎక్కడవున్నా తమ్ముణ్ణి మరిచిపోలేని అశక్తతతో బాధపడసాగాడు. బాధపడ్డకొద్దీ, మనిషిరాటుతేలే అవకాశం వుంటుందికనుక, చలపతిని వాడి బాధకు వొదిలెయ్యటమే మంచిదని భద్రయ్య నిశ్చయించుకున్నాడు.

## 6

రెండేళ్ళు గడిచినవి.

ఈ రెండేళ్ళలోనూ భద్రయ్యలో రెండు దశాబ్దాల శక్తి హరించుకుపోయి నట్లయింది. అనుకోనంత త్వరలోనే ముసలితనం వొచ్చిపడినట్లనిపించింది.

కొద్దిసేపు పనిచేసేప్పటికే భద్రయ్య చాలా అలసిపోతున్నాడు. ఉన్న శక్తినంతట్నీ వినియోగించివేయటంవల్ల, ఆ అలుపును తట్టుకోలేక పోతున్నాడు. దాదాపు బలవంతంగానే పని చేసుకుపోతున్నాడు. కాకపోతే ఇప్పుడు చలపతి బాగా ఎక్కివొచ్చాడు. తను చేయవలసిన పనిని వాడు పూర్తిచేస్తున్నాడు. మొత్తంమీద వ్యాపారం దెబ్బతినకుండా గడుపుకొని వొస్తున్నాడు. ఈ రెండేళ్ళల్లోనూ పెద్దపిల్లకు మాత్రం పెళ్ళిచేయగలిగాడు.

ఈ మధ్య భద్రయ్యకు జ్వరంకూడా వొస్తోంది. ఐనప్పటికీ లెక్కచేయకుండానే నెట్టుకొని తిరుగుతున్నాడు. రాత్రిళ్ళు దగ్గుతో బాధపడుతున్నా కూడా భరించటం నేర్చుకోసాగాడు.

కాని ఒక స్థితిలో మరి భరించలేనివాడయ్యాడు. తప్పనిసరి అనుకున్నాక, డాక్టర్ను చూశాడు. డాక్టర్ చాలా పరీక్షలు చేశాక క్షయవ్యాధి కిందికి తేల్చాడు. పూర్తిగా విశ్రాంతి తీసుకోవటం, తగిన చికిత్స పొందటం అత్యవసరమని హెచ్చరిక చేశాడు.

భద్రయ్య డాక్టర్ను నమ్మలేదు. 'గోరంతలు కొండంతలు చేస్తారు వీళ్ళు' అనుకున్నాడు... ఒకవేళ తనను క్షయవ్యాధి వెంటాడుతూన్నప్పటికీ, డాక్టర్ చెప్పిన రకం విశ్రాంతిగానీ, చికిత్సగానీ తనకు అందుబాటులో వున్నదిమాత్రం కాదు. ఎవరో పెట్టిపుట్టిన మహారాజులు పొందాల్సిన చికిత్స తనకెలా లభ్యమౌతుంది!

బ్యాంకులో రెండువేలదాకా వున్నమాట నిజమేకాని, అది కాస్తా తన యీ చికిత్సకు ఖర్చుచేయటం భద్రయ్యకు బొత్తిగా ఇష్టంలేదు. ఆ తరువాత ఒకవేళ తను ఛస్తే...? తన బాధ్యత లన్నింటినీ ఇంకా నెరవేర్చకుండానే, కనీసం నెరవేర్చవలసిన వాళ్ళకు సహాయంగా ఉండే ధనాన్ని ఖర్చుచెయ్యటం అవివేకమే అవుతుందనిపించింది.

మరికొన్ని రోజులపాటు తోసుకు తిరిగాడు. కాని మరీ లేవలేనిస్థితి వొచ్చాక భద్రయ్యకు దిగులుపట్టుకుంది. తన చావు దగ్గర్లో పడ్డదని కాదుకాని, తను స్థాపించిన ఈ వ్యాపారం ఏమౌతుందోనని అతని భయం! ఏవిధంగానైనా సరే, తను చచ్చినప్పటికీ, యీ కుటుంబం సుఖపడే విధానమేమైనా వుంటే తను తప్పకుండా ప్రయత్నించాల్సిందే... నిజానికి తను ఛస్తే ఇన్స్యూరెన్సు డబ్బు రెండువేల రూపాయిలూ వొస్తవి; కనుక తను చావటమే మంచిదనిపించిందతనికి!

భద్రయ్య మంచాన పడ్డాడు. చలపతికి చెప్పవలసినవన్నీ చెపుతూనే వున్నాడు. వాడి బాధ్యతల్ని జ్ఞాపకం చేస్తూ, వాడు లాగవలసిన బరువుభారాన్ని నూరిపోస్తూనే వున్నాడు. చలపతికి ఇంగితజ్ఞానం వృద్ధయింది; అనుభవంతో పాటు తనపైన పడబొయ్యే బాధ్యతల్ని గ్రహించాడు. తండ్రిలాగే కష్టించి పనిచెయ్యటంలో వాడు వెనకడుగు వేయలేదు. కొడుకు ప్రయోజకుడయ్యాడు కదాననే ఆనందం భద్రయ్యకు కలిగింది.

భార్య ఎంత పోరినా భద్రయ్య మందు మాకులకు ఖర్చుపెట్టేందుకు ఎంతకూ ఒప్పుకోలేదు. భూమిమీద గింజలు ప్రాప్తముంటే బతుకుతాననే నమ్మకం అతనికి కలిగింది. బతికేతీరాలనేవాడికి ఆతృతకాని, చచ్చేందుక్కూడా సిద్ధపడ్డ తనకేమిటి?

వ్యాధి చాలా శీఘ్రగతిన పెరగజొచ్చింది. తనకు అవసానకాలం దగ్గరవుతూన్నదనే అనుమానం తగిలాక భద్రయ్య బతికేందుకు ప్రయత్నించటం మౌఢ్యమే అవుతుందని నిర్ణయించుకున్నాడు. తను లేకపోయినప్పటికీ, చలపతి కుటుంబభారాన్ని లాగే యోగ్యుడయ్యాడనే గర్వం కూడా కలిగింది.

తనను చూసేందుకు వెంకటరత్నం వొచ్చాడు. అంత్య సందేశంగా "చలపతిని మీ చేతుల్లో పెడుతున్నాను. వాడి జీవితాన్ని బాగుచేసి కుటుంబసౌఖ్యాన్ని ఒక కంట

కనిపెట్టి ఉండండి" అని చెప్పాడు. వెంకటరత్నం చేయవలసిన వాగ్దానాలన్నిటినీ చేశాడు. ప్రశాంతమైన స్థితిలోనే భద్రయ్య శాశ్వతంగా కన్నుమూశాడు.

భద్రయ్య పోయిన మూడో రోజు చలపతి, ఫోర్తుఫారం చదివే తమ్ముణ్ని వెంటపెట్టుకొని దుకాణం తెరిచేందుకు వొచ్చాడు. వెంకటరత్నం యీసారి చాలా ఆశ్చర్యపడ్డాడు. భద్రయ్యలాటి అనుభవజ్ఞుడిలో కనిపించాల్సిన మనోనిబ్బరం చలపతిలో చూడగలగటమే ఆ ఆశ్చర్యానికి కారణం.

"అంత తొందర రేమొచ్చిందీ? నాలుగు రోజులయ్యాక పని ప్రారంభించక పొయ్యావా?" అన్నాడు వెంకటరత్నం.

"చచ్చినవాళ్ళకోసం ఏడుస్తూ కూర్చునే తీరిక ఎక్కడిదండి!" అన్నాడు చలపతి. భద్రయ్య కొడుకుపోయినప్పుడూ ఇదే సమాధానం చెప్పాడు.

"సరే... వీడు చదువుకుంటున్నాడు కదా! వీణ్ని చదువుకోనీక పనిలోకి లాక్కొచ్చావ్ దేనికీ?" అన్నాడు వెంకటరత్నం.

"ఆc. వీడు చదివి సంపాయించేది ఏముంటుందిలెండి! ఏదో పనన్నా నేర్చుకుంటే, ఇప్పటినుంచే కుటుంబానికి కాస్తో కూస్తో సంపాయిస్తూంటాడు. మాబోటి వాళ్ళకు చదువులు అనవసరం!"

వెంకటరత్నం ఇలాటి జవాబును పూర్వం భద్రయ్య నోటిగుండా విన్నాడు. వీడుకూడా తండ్రిలాగే కరుకుదేలాడని గ్రహించేందుకు ఎక్కువసేపు పట్టలేదు. ఎంతైనా చరిత్ర పునశ్చరణ కాక తప్పదు కదా! తరాలు గడిచినా మార్పు ఉంటుందనే నమ్మకం ఏమిటి? ఎవరి సుఖం వాళ్ళు చూసుకోవటం కుదరదేమో? ప్రతిఒక్కరూ ఇతర్లకోసమే బతుకుతూండటం, అందుకే తమకు చేతనైనంత త్యాగం చేయటం జరగక తప్పదేమో? తండ్రిని మరిపించే చలపతి తత్వం యీ విషయాన్నే రూఢిపరుస్తోంది...

వెంకటరత్నం ఆలోచనలు, మిషన్ మోతలో కలిసిపోయినవి!

*- డిసెంబర్, 1953*